సాక్షి
ములుగు

గురువారం । 11 । మే । 2023



మానసిక ప్రశాంతతకు క్రీడలు దోహదం

మానసిక ప్రశాంతతకు క్రీడలు దోహదం చేస్తాయని ఒలింపిక్ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మహ్మద్ అజీజ్‌ఖాన్ అన్నారు. - 8లో▸



పథకాలను పటిష్టంగా అమలు చేయాలి

- 8లో▸

కేంద్రం మైనార్టీల సంక్షేమానికి ప్రవేశపెట్టిన పథకాలు అమలు చేయాలని జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ షహజాది అన్నారు.



వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు వడగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది.

బాలికలదే పైచేయి

పదో తరగతి ఫలితాల్లో జిల్లాకు 8వ స్థానం

- ఉత్తీర్ణత 92.98 శాతం
- సత్తా చాటిన గురుకుల విద్యార్థులు

ములుగు: పదో తరగతి పరీక్షల ఫలితాల్లోనూ బాలికలదే పైచేయిగా నిలిచింది. రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం విడుదలైన పదో తరగతి వార్షిక పరీక్షల ఫలితాల్లో జిల్లా 8వ స్థానంలో నిలిచింది. జిల్లాలో 92.98శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. జిల్లా వ్యాప్తంగా 3,163 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 2,941 మంది విద్యార్థులు పాసయ్యారు. జిల్లా వ్యాప్తంగా 92.98 శాతం ఉత్తీర్ణత నమోదు అయ్యింది.

బాలికలదే హవా

జిల్లా వ్యాప్తంగా 1,660 మంది బాలురు పరీక్ష రాయగా 1,517 మంది ఉత్తీర్ణత సాధించారు. 91.39 ఉత్తీర్ణత శాతం నమోదు అయ్యింది. బాలికల విభాగంలో 1,503 మంది విద్యార్థినులకు గాను 1,424 మంది విద్యార్థినులు ఉత్తీర్ణత సాధించారు. 94.74 ఉత్తీర్ణత శాతం నమోదు అయ్యింది.

కస్తూర్బా గాంధీ విద్యార్థినుల ప్రతిభ

ములుగు మండల పరిధిలోని మాధవరావు పల్లి, కన్నాయిగూడెం, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు(కేజీబీవీలు) వందశాతం ఉత్తీర్ణతను సాధించుకున్నాయి. కన్నాయిగూడెం కేజీబీవీకి చెందిన విద్యార్థిని శైలజా 9.5జీపీఏ సాధించింది. దీంతో పాటు బండారు పల్లి మోడల్ పాఠశాల, బండారుపల్లి రెసిడేన్సియల్ బాలుర పాఠశాల, జాకారం సోషల్ వెల్ఫేర్ బాలుర గురుకులం, జెడ్పీఎస్ఎస్ అబ్బాపూర్, దేవగిరి పట్నం, ములుగు, పస్రా, కోయగూడెం, బీరెల్లి, ఇంద్రానగర్, కాసిందేవ్ పేట, పత్తిపల్లి, గోవిందరావు పేట, వెంకటాపురం, ఏటూరునాగారం, నార్లాపూర్, మేడారం, ములుగు ప్రభుత్వ పాఠశాల, రాయనిగూడెం, ఊరట్టం, కొడిశాల పాఠశాలల్లోని విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణతను సాధించారు.


రమ్యశ్రీ(10/10) బండారుపల్లి


శ్రావణ్(10/10) బండారుపల్లి


దినేశ్(10/10) జాకారం

10 జీపీఏ సాధించిన విద్యార్థులు

ములుగు మండల పరిధిలోని బండారుపల్లి మోడల్ పాఠశాలకు చెందిన విద్యార్థిని మామిడిశెట్టి రమ్యశ్రీ, వెంకటాపురం(ఎం) మండలంలోని జవహర్‌నగర్ మోడల్ పాఠశాల విద్యార్థి ఓదెల హరీశ్, బండారుపల్లి గురుకులం విద్యార్థి గౌడ శ్రావణ్, జాకారం సాంఘిక సంక్షేమ గురుకులం పాఠశాల విద్యార్థి కొమ్మిడి దినేశ్, ఏటూరునాగారం జెడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థి బెడిక లవనీత్ కుమార్‌లు, ఎంజేపీ గురుకులంకు చెందిన బిళ్ల హర్షిత, కొండ శరణ్య, గంగుల సుస్మితలు 10/10 జీపీఏ సాధించారు.

విద్యార్థులకు అభినందనలు



"పదో తరగతి ఫలితాల్లో 10/10 జీపీఏతో పాటు వందశాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల విద్యార్థులకు అభినందనలు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రణాళికతో బోధించి జిల్లాను 8వ స్థానంలో నిలిపేందుకు కృషి చేసిన ఉపాధ్యాయులకు అభినందనలు. ఫెయిల్ అయిన విద్యార్థులు నిరుత్సాహ పడకూడదు. ప్రణాళికతో చదివి సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి.- **పాణిని, డీఈఓ**

స్థల పరిశీలన


క్రీడా మైదానాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ

ఏటూరునాగారం: ఈ నెల 15 నుంచి 17 తేదీ వరకు మండల కేంద్రంలో సీఎం కప్ క్రీడలకు కావాల్సిన క్రీడా మైదానాన్ని పరిశీలించినట్లు జెడ్పీ సీఈఓ ప్రసూనరాణి తెలిపారు. మండల కేంద్రంలోని క్రీడా మైదానాన్ని ఆమె బుధవారం ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు సీఎం కప్ క్రీడలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయ, సర్పంచ్ రాంమూర్తి, జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలియాబీ, తహసీల్దార్ లక్ష్మణ్, ఎంపీడీఓ కుమార్ ఉన్నారు.

ముగిసిన హేమాచలుడి బ్రహ్మోత్సవాలు


వసంతోత్సవ కార్యక్రమంలో యాగ్నిక పూజారులు

మంగపేట: మండల పరిధిలోని మల్లూరు శ్రీ హేమాచల క్షేత్రంలో ఈ నెల ఒకటవ తేదీ నుంచి ప్రారంభమైన లక్ష్మీనర్సింహస్వామి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు(జాతర) బుధవారం వసంతోత్సవం కార్యక్రమంతో ముగిశాయి. ఆలయంలో 10 రోజుల పాటు వైభవంగా స్వామివారి బ్రహ్మోత్సవాల రోజువారి కార్యక్రమాలను భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఉప ప్రధానార్చకులు అమరవాది మురళీ కృష్ణమాచార్యుల శిష్య బృందం పాంచరాత్ర ఆగమశాస్త్ర ప్రకారం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల ముగింపు రోజులో భాగంగా ఆలయ కార్యనిర్వహణ అధికారి శ్రావణం సత్యనారాయణ ఆధ్వర్యంలో లక్ష్మీనర్సింహస్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి ప్రత్యేక పల్లకి (సేవ)పై ఉంచి ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపం నుంచి దైత అమ్మవారు(వనదేవత) ప్రాంగణం వరకు డోలి సన్నాయి వాయిద్యాలతో వసంతోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యాగ్నికులు, ఆలయ పూజారులు, సిబ్బంది ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ వసంతోత్సవ కార్యక్రమాన్ని జరుపుకున్నారు.

జేపీఎస్‌లపై దాడులు సరికాదు


జేపీఎస్‌లకు మద్దతుగా నినాదాలు చేస్తున్న సీతక్క

ములుగు: శాంతియుతంగా సమ్మె చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులపై భౌతిక దాడులకు దిగడం సరికాదని ఏఐసీసీ మహిళా ప్రధాన కార్యదర్శి, ములుగు ఎమ్మెల్యే సీతక్క అన్నారు. జిల్లాకేంద్రంలోని పోస్టాఫీస్ పక్కన జేపీఎస్‌లు చేపట్టిన సమ్మె స్థలికి బుధవారం ఎమ్మెల్యే చేరుకుని వారికి మద్దతు ప్రకటించి మాట్లాడారు. ఎవరికీ ఇబ్బందులు కలగకుండా జేపీఎస్‌లు టెంటు వేసుకుని నిరసన తెలుపుతుంటే బీఆర్ఎస్ నాయకులకు వచ్చిన సమస్య ఏంటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజేందర్‌గౌడ్, చాంద్‌పాషా, ఎంపీటీసీ తిరుపతిరెడ్డి, భిక్షపతి పాల్గొన్నారు.

బీసీ గురుకులాల్లో 97శాతం ఉత్తీర్ణత

- టెన్త్‌లో ఉత్తమ ప్రతిభచాటిన విద్యార్థులు
- 12 గురుకులాల్లో వంద శాతం ఉత్తీర్ణత



కట్ల స్ఫూర్తి, ఎస్.రుచిత, కె.రచన, ఎం.తేజస్విని, హర్షిత, దేవరకొండ ఆశిష్, కర్నె చరణ్, పి.యశ్వంత్, పుల్లా అర్చన, బానోతు ఆదిత్య, పి.సాయిచరణ్, కె.శరణ్య, బి.హర్షిత, జి.సుష్మిత

విద్యారణ్యపురి: టెన్త్ పరీక్షల ఫలితాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా బీసీ మహాత్మాజ్యోతిరావుపూలే బీసీ గురుకులాల విద్యార్థులు 97శాతంమంది ఉత్తీర్ణుల య్యారు. హనుమకొండ, వరంగల్, ములుగు, జనగామ, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాలో 29 గురకులాలు ఉండగా అందులో 12 గురుకులాల్లో వందశాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 15మంది విద్యార్థులు 10/10 జీపీఏతో ఉత్తీర్ణత సాధించడం విశేషం. 29 బీసీ గురుకులాల్లో టెన్త్ పరీక్షలకు 2,215 మంది విద్యార్థులు హాజరుకాగా అందులో 2,144మంది విద్యార్థులు ఉత్తీర్ణత (97శాతం) సాధించారని ఉమ్మడి వరంగల్ జిల్లా బీసీ ఆర్‌సీఓ మనోహర్‌రెడ్డి తెలిపారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించిన గురుకులాలు..

హనుమకొండ జిల్లాలో కాజీపేట(జి), పెద్దాపూర్(జి), ఐనవోలు బాయ్స్, వరంగల్ జిల్లా నల్లబెల్లి(బి), ములుగు జిల్లా పాకాల కొత్తగూడ (జి), వెంకటాపూర్(బి), జయశంకర్ భూపాలపల్లి జిల్లా గాంధీనగర్(జి), భూపాలపల్లి(బి), మొగుళ్లపల్లి(బి)జనగామ జిల్లా, బచ్చన్నపేట(బి), మొండ్రాయి(జి), మహబూబాబాద్ జిల్లా గుమ్ముడూరు(బి).

10/10 జీపీఏ సాధించిన విద్యార్థులు..

హనుమకొండలోని బాయ్స్ బీసీ గురుకులం కర్నె చరణ్, కాజీపేట బీసీ బాలికల గురుకుల విద్యార్థిని మామిడాల హర్షిత, ఉర్సుగుట్టలోని వరంగల్ జీ గురుకులంలో బట్టు గురుప్రియ, శ్యాయంపేటలోని గురుకుల పి.యశ్వంత్, హనుమకొండ జిల్లాలోని తిమ్మాపూర్ బాలిక గురుకులంలో పుల్లా అర్చన, బచ్చన్నపేటలోని గురుకులం విద్యార్థులు బానోతు ఆదిత్య, పి.సాయిచరణ్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా గాంధీనగర్ గురుకులం విద్యార్థిని ఎం.తేజస్విని, వర్ధన్నపేట బీసీ బాలికల గురుకులం విద్యార్థినులు కట్ల స్ఫూర్తి, ఎస్.రుచిత, కె.రచన, మొగుళ్లపల్లి బాయ్స్ బీసీ గురుకులం విద్యార్థి దేవరకొండ ఆశిష్, పాకాల కొత్తగూడ గురుకులానిక చెందిన కె.శరణ్య, బి.హర్షిత, జి.సుష్మిత ఉన్నారు.

విద్యుత్ అంతరాయాలపై సీఎండీ ఆగ్రహం

హన్మకొండ: విద్యుత్ అంతరాయాలు, తరచూ బ్రేక్ డౌన్స్, ట్రిప్పింగ్స్‌పై టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్‌రావు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం హనుమకొండలోని క్యాంపు కార్యాలయం నుంచి ఖమ్మం, కొత్తగూడెం సర్కిళ్ల ఎస్ఈలు, డీఈలు, ఏడీలు ఎస్ఏఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలు, డివిజన్‌లు, సబ్ డివిజన్‌ల వారీగా ప్రగతిని సమీక్షించారు. ట్రిప్పింగ్స్, బ్రేక్ డౌన్స్ ఏర్పడి విద్యుత్ సరఫరాలో అంతరాయాలు కలిగితే విద్యుత్ వినియోగదారులకు ఇబ్బందులు పడుతున్నారని అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు బి.వెంకటేశ్వర్ రావు, పి.గణపతి, పి.సంధ్యారాణి, పిన్నింటి మోహన్ రెడ్డి, వి.తిరుపతి రెడ్డి, డీఈ ఐటీ అనిల్ కుమార్, సీజీఎంలు, జీఎంలు ఎస్ఈలు పాల్గొన్నారు.

కాజీపేట జంక్షన్ మీదుగా ప్రత్యేక రైళ్లు



కాజీపేట రూరల్: వేసవి ప్రయాణికుల రద్దీ దృష్ట్యా సికింద్రాబాద్– ధానాపూర్ మధ్య కాజీపేట జంక్షన్ మీదుగా వేసవి ప్రత్యేక రైళ్లను నడిపిస్తున్నట్లు బుధవారం దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. సికింద్రాబాద్– దానాపూర్ (07419) ఎక్స్‌ప్రెస్ మే 13, 20, 27వ తేదీల్లో కాజీపేట జంక్షన్‌కు సాయంత్రం 05:15 గంటలకు చేరుకుంటుంది. దానాపూర్ –సికింద్రాబాద్ (07420) ఎక్స్‌ప్రెస్ మే 16, 23, 30వ తేదీల్లో కాజీపేట జంక్షన్‌కు రాత్రి 09:50 గంటలకు చేరుకుంటుంది. ఈ ఎక్స్‌ప్రెస్‌కు కాజీపేట, పెద్దపల్లి, బెల్లంపల్లి, సిర్పూర్‌కాగజ్‌నగర్, బల్లార్షా, నాగ్‌పూర్, ఇటార్సీ, పిపారియ, జబల్‌పూర్, కట్నీ, సాత్నా, మాణిక్‌పూర్, ప్రయాగ్‌రాజ్, పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ బక్సర్, ఆరా స్టేషన్లలో హాల్టింగ్ సౌకర్యం కల్పించినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

మైనార్టీ గురుకులాల సత్తా..

- పది ఫలితాల్లో విద్యార్థుల ఉత్తమ ప్రతిభ



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో వరంగల్(జి)1 ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

న్యూశాయంపేట: పదో తరగతి ఫలితాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న 16 మైనార్టీ ఇంగ్లిష్ మీడియం గురుకులాల విద్యార్థులు అత్యున్నత గ్రేడ్‌లు సాధించి విజయభేరి మోగించారు. అన్ని గురుకులాలు మెరుగైన ఉత్తీర్ణత శాతాన్ని నమోదు చేసుకున్నట్లు రీజినల్ లెవల్ కన్సల్టెంట్ శ్రీపాల తెలిపారు. వరంగల్ (జి)1, జనగామ(బి)1, వందశాతం, నర్సంపేట(జి)1, మహబూబాబాద్(బి)1, ఘన్‌పూర్ (జి)1, హనుమకొండ(బి)1, వర్ధన్నపేట(బి)1, పరకాల(బి)1, 98శాతం, ములుగు (జి)1, 97శాతం, డోర్నకల్ (జి)1, తొర్రూర్ (జి)1, హనుమకొండ(జి)1, 96శాతం, వరంగల్ (బి)1, భూపాల్‌పల్లి(బి)1,95శాతం, కాజీపేట(బా)1, 92 శాతం, వరంగల్(జి)2, 83శాతం ఉత్తీర్ణత ఫలితాలు సాధించారని తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 910 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 878 ఉత్తీర్ణత సాధించారు. మొత్తంగా 96శాతం ఉత్తీర్ణత శాతాన్ని సాధించారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను జిల్లా మైనార్టీ సంక్షేమాధికారులు మేన శ్రీను, విక్రమ్‌కుమార్, ఇస్మాయిల్‌లతో పాటు ప్రిన్సిపాళ్లు భిక్షపతి, క్రిష్ణకుమారి, నీరజ, శ్రీనివాస్, మాధవి అభినందించారు.

గిరిజన పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు

- 83.6శాతం ఉత్తీర్ణత

ఏటూరునాగారం: ఐటీడీఏ పరిధిలోని గిరిజన విద్యాసంస్థల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారు. 96 గిరిజన పాఠశాలల్లో 2,443 మంది బాల బాలికలు వార్షిక పరీక్షలు రాయగా 2,042 మంది (83.6శాతం) ఉత్తీర్ణత సాధించినట్లు ఐటీడీఏ పీఓ అంకిత్ బుధవారం తెలిపారు. 96 పాఠశాలల్లో 21స్కూళ్లు వందశాతం ఉత్తీర్ణత సాధించాయన్నారు. ములుగు జిల్లాలోని 32 గిరిజన పాఠశాలల్లో 731మంది విద్యార్థులకు 644మంది(88శాతం) ఉత్తీర్ణత నమోదు చేశారు. ఇందులో ములుగు, మేడారం, కొడిశాల, రాయినిగూడెం, పస్రా పాఠశాలలు 100శాతం ఫలితాలు సాధించాయి. భూపాలపల్లి జిల్లాలోని 10గిరిజన పాఠశాలల్లో 233 మంది విద్యార్థులకు 185మంది(79శాతం) ఉత్తీర్ణత సాధించారు. దీనిలో మేడిపల్లి, మహాముత్తారం, తాడిచర్ల పాఠశాలలు వందశాతం ఉత్తీర్ణత సాధించాయి. మహబూబాబాద్ జిల్లాలోని 30 విద్యాసంస్థల్లో 856 మందికి 661మంది(77శాతం) ఉత్తీర్ణత నమోదు చేశారు. దీనిలో సాదిరెడ్డిపల్లి, కురవి, తొర్రూరు పాఠశాలల్లో 100శాతం ఫలితాలు నమోదయ్యాయి. వరంగల్ జిల్లాలోని 8పాఠశాలల్లో 275 మంది విద్యార్థులకు 247మంది(90శాతం) ఉత్తీర్ణత పొందారు. దీనిలో వరంగల్, సంగెం, వర్ధన్నపేట పాఠశాలలు 100శాతం ఫలితాలు సాధించాయి. హనుమకొండ జిల్లాలో 173 మందికి 150మంది(89శాతం) ఉత్తీర్ణత సాధించారు. జనగామ జిల్లాలో 175 మందికి 150 మంది పాసయ్యారు. తరిగొప్పుల పాఠశాల 100శాతం ఉత్తీర్ణత సాధించింది. అదేవిధంగా 15గురుకుల పాఠశాలల్లో 1,211మంది విద్యార్థులకు గానూ 1,143 మంది ఉత్తీర్ణత సాధించి 94.4శాతం నమోదు చేశారు. 3గురుకులాలు 100శాతం ఫలితాలు నమోదయ్యాయని పీఓ తెలిపారు.

మానసిక ప్రశాంతతకు క్రీడలు దోహదం

- ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్షుడు అజీజ్‌ఖాన్
- జేఎన్ఎస్‌లో కార్మిక క్రీడోత్సవాలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అజీజ్‌ఖాన్

వరంగల్ స్పోర్ట్స్: మానసిక ప్రశాంతతకు క్రీడలు దోహదపడతాయని ఒలింపిక్ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ అజీజ్‌ఖాన్ అన్నారు. మేడే ను పురస్కరించుకుని బీఆర్ఎస్ పార్టీ సహకారంతో కార్మికశాఖ, ఒలింపిక్ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న క్రీడా పోటీలు బుధవారం హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ అజీజ్‌ఖాన్ హాజరై కబడ్డీ పోటీలను ప్రారంభించారు. మొదటి మ్యాచ్ భవన నిర్మాణ రంగ కార్మికుల సంఘం వర్సెస్ ఎలక్ట్రానిక్ మెకానిక్ సంఘం మధ్య జరిగింది. ఈ సందర్భంగా అజీజ్‌ఖాన్ క్రీడాకారులను పరిచయం చేసుకుని మాట్లాడారు. మొదటి రోజు కబడ్డీ, చెస్, క్యారం, మ్యూజికల్ చైర్, షటిల్ బ్యాడ్మింటన్ అంశాల్లో పోటీలను నిర్వహించారు. గురువారం సాయంత్రం జరిగే ముగింపు పోటీలకు ప్రభుత్వ చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్ హాజరై విజేతలకు బహుమతులను అందజేస్తారని వెల్లడించారు. కార్యక్రమంలో కార్మిక క్రీడోత్సవాల కోఆర్డినేటర్లు పుల్లా శ్రీనివాస్, కేసోజు ప్రణయ్, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ సామ్యేల్‌జాన్, కబడ్డీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొత్త కృష్ణారెడ్డి, డీఎస్‌ఏ కోచ్‌లు శ్రీమన్నారాయణ, నరేందర్, శంకర్, ప్రశాంత్, అఫ్జల్, విష్ణు, రమేష్ కార్మిక సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

పెళ్లింట విషాదం

- మూడు రోజుల క్రితం అనారోగ్యంతో వధువు తండ్రి మృతి
- తాజాగా రోడ్డు ప్రమాదంలో వరుడి మృతి



సాగర్ (ఫైల్)



పెళ్లి పత్రిక

రామన్నపేట : మూడు రోజులు గడిస్తే పెళ్లి. అంగరంగ వైభవంగా వివాహ తంతు నిర్వహించేందుకు వధూవరుల బంధువులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. అనుకోని ఘటనలతో ఆ రెండు కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. మూడు రోజుల క్రితం అనారోగ్యంతో వధువు తండ్రి చనిపోగా, మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వరుడు దుర్మరణం చెందాడు. ఈ విషాద ఘటన వరంగల్ నగరంలోని 29వ డివిజన్ రామన్నపేటలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. రామన్నపేటకు చెందిన రమాదేవి –కృష్ణల కుమారుడు సాగర్(27)కు హనుమకొండకు చెందిన రాజశ్రీ– బాలచందర్ కూతురు శ్రీజకు వివాహం చేసేందుకు నిర్ణయించుకున్నారు. ఈ నెల 3న నిశ్చితార్థం నిర్వహించుకుని 12వ తేదీన వివాహ ముహూర్తం పెట్టుకున్నారు. ఈ క్రమంలో 7వ తేదీన వధువు తండ్రి బాలచందర్ (40)అనారోగ్యంతో మృతిచెందాడు. అతని దశదిన కర్మ అనంతరం మరో ముహూర్తం పెట్టుకోవాలనుకున్నారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి వరంగల్‌లోని నిర్మలమాల్ ఎదుట గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో వరుడు సాగర్ తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అతన్ని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి బుధవారం ఉదయం తెల్లవారుజామున చనిపోయాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సాగర్ సీసీ కెమెరాల టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. త్వరలో పెళ్లిపీటలు ఎక్కుతాడని భావించిన కొడుకు అర్థంతరంగా అనంతలోకాలకు వెళ్లాడని తండ్రి కృష్ణ రోదించిన తీరు అందరినీ కంటతడిపెట్టించింది.

యువకుడి ఆత్మహత్య

వరంగల్: నగరంలోని ముసలమ్మకుంట ఇందిరమ్మ కాలనీ ఫేజ్ –1కు చెందిన యువకుడు దిడ్డిరాజు(27) బుధవారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఏనుమాముల ఎస్సై రాజన్ బాబు తెలిపారు. ఇందిరమ్మకాలనీలో తల్లితో రాజు పదేళ్లుగా నివాసం ఉంటున్నారని, చెల్లెకు పెళ్లిఅయిందని, అవివాహితుడు అయిన రాజు అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసిందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్సై పేర్కొన్నారు.

12 నుంచి ఓపెన్ ఇంటర్ ప్రాక్టికల్స్

విద్యారణ్యపురి: ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ విద్యార్థులకు రేపటినుంచి ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహించనున్నారని డీఈఓ ఎండీ అబ్దుల్‌హై, ఓపెన్ స్కూల్ ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ మురాల శంకర్‌రావు బుధవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఆయా విద్యార్థులు తమ స్టడీ సెంటర్లలో హాల్‌టికెట్లు తీసుకోవాలని లేదా సంబంధిత వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.తెలంగాణ ఓపెన్‌స్కూల్ .ఓఆర్‌జీ లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. జిల్లా కేంద్రాలు లేదా రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో ఏర్పాటుచేసిన పరీక్షాకేంద్రాల్లో తమకు కేటాయించిన కేంద్రాల్లో ప్రాక్టికల్స్ పరీక్షలకు హాజరుకావాలని సూచించారు. ప్రాక్టికల్స్ పరీక్షలు ఈనెల 12నుంచి 19వరకు ప్రతిరోజు ఉదయం 9–30 గంటలనుంచి మధ్యాహ్నం 12–30గంటలవరకు, మధ్యాహ్నం 2గంటలనుంచి సాయంత్రం 5గంటలవరకు నిర్వహిస్తారని వెల్లడించారు.

డీఈఈ సెట్‌కు ఉచిత శిక్షణ

న్యూశాయంపేట: డీఈఈ సెట్(డిప్లోమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్)–2023 కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ఉర్దూ మీడియం మైనార్టీ అభ్యర్థులు సెట్‌లో ప్రతిభ చాటేందుకు ఈనెల 15 నుంచి 29 తేది వరకు ఉచిత శిక్షణ అందచేయనున్నట్లు కో–ఆర్డినేటర్ హాజరా సుల్తానా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెంటర్ ఆఫ్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనారిటీస్(సీఈడీఎం) హైదరాబాద్ ఆధ్వర్యంలో ఈ శిక్షణను అందచేయనున్నట్లు వెల్లడించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న మైనార్టీటీ అభ్యర్థులు అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 99485 17215, 73866 55531 నంబర్‌లో లేదా.. హనుమకొండ పెట్రోల్‌పంప్ వద్ద ఉన్న జీజీహెచ్‌ఎస్ స్కూల్‌లో సంప్రదించాలని తెలిపారు.

ఎస్ఆర్ పాఠశాలల విద్యార్థుల విజయభేరి



ఉత్తమ జీపీఏ సాధించిన విద్యార్థులతో వరదారెడ్డి

హన్మకొండ చౌరస్తా: బుధవారం విడుదల చేసిన టెన్త్ వార్షిక పరీక్ష ఫలితాల్లో ఎస్ఆర్ పాఠశాలల విద్యార్థులు విజయభేరీ మోగించారు. హనుమకొండలోని ఎస్ఆర్ పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్ఆర్ విద్యా సంస్థల చైర్మన్ వరదారెడ్డి వివరాలు వెల్లడించారు. ఎస్ఆర్ విద్యా సంస్థల విద్యార్థులు 112మంది 10/10 జీపీఏతో మరోమారు తమ ఆధిపత్యాన్ని కొనసాగించారని అన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్య, పటిష్టమైన ప్రణాళిక, అంకిత భావం కల్గిన ఉపాధ్యాయులే విజయానికి కారణమని అన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధం చేసేందుకు బృహత్తర పద్ధతిలో ప్రైమ్ స్కూల్స్ రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించామని తెలిపారు. విజయాన్ని సాధించిన విద్యార్థులను ప్రోత్సహించిన తల్లిదండ్రులు, అధ్యాపక బృందానికి ఎస్ఆర్ విద్యాసంస్థల అధినేత వరదారెడ్డి, డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

తేజస్వి విజయకేతనం



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు, యాజమాన్యం

నయీంనగర్: ఎస్ఎస్‌సీ ఫలితాల్లో తేజస్వి తన విజయ పరంపరను కొనసాగిస్తూ విజయ కేతనం ఎగురవేసింది. 104 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించి రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచారు. 83 మంది విద్యార్థులు 9.8 జీపీఏ, 53 మంది విద్యార్థులు 9.7 జీపీఏ, 49 మంది విద్యార్థులు 9.5 జీపీఏ, 39 మంది విద్యార్థులు 9.3 జీపీఏ, 33 మంది విద్యార్థులు 9.2 జీపీఏ, 15 మంది విద్యార్థులు 9 జీపీఏ సాధించారు. ఈ విజయానికి ముఖ్యకారకులైన విద్యార్థులకు, తల్లితండ్రులకు, కీలక పాత్ర వహించిన బోధన, బోధనేతర సిబ్బందికి తేజస్వి విద్యా సంస్థల చైర్మన్ రేవూరి జెన్నారెడ్డి, డైరెక్టర్ పి.చంద్రశేఖర్, ప్రిన్సిపల్స్ జి.సంధ్యారాణి, జె.పూర్ణచందర్ రావు, జి.సహజ, ఉపాధ్యాయ బృందం ప్రత్యేక అభినందనలు తెలిపారు.

శ్రీ చైతన్య విద్యార్థుల ప్రభంజనం



ప్రతిభ కనబరిచిన శ్రీ చైతన్య విద్యార్థులు

హన్మకొండ: పదో తరగతి ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. 408 మంది విద్యార్థులు 10/10 జీపీఏ సాధించారని ఆ విద్యా సంస్థల అధినేత మల్లెంపాటి శ్రీధర్ బుధవారం తెలిపారు. 809మంది 9.8, 1,524మంది 9.5, 2,670 మంది 9 మంది జీపీఏ సాధించారని వివరించారు. వరంగల్ మహానగరంలోని శ్రీ చైతన్య పాఠశాలలకు చెందిన 72 మంది విద్యార్థులు 10/10 జీపీఏ సాధించారని తెలిపారు. 39 మంది విద్యార్థులు 9.8, 243 మంది 9 జీపీఏ సాధించారని వివరించారు. చక్కటి బోధనా కరిక్యులమ్, ప్రణాళిక బద్ధంగా ముందుకు పోవడం ద్వారా ఈ విజయాలు సాధిస్తున్నామని తెలిపారు. తెలంగాణలో శ్రీ చైతన్య విద్యా సంస్థలు అత్యుత్తమ ఫలితాలు సాధించిందన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను శ్రీ చైతన్య విద్యా సంస్థల అధినేత మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య అభినందించారు.

పది ఫలితాల్లో 'పైన్'



ప్రతిభ చూపిన విద్యార్థులతో మూగల కుమార్ యాదవ్, డైరెక్టర్లు

హన్మకొండ: పదో తరగతి ఫలితాల్లో పైన్ విద్యార్థులు విజయభేరి మోగించారు. బుధవారం హనుమకొండ రాంనగర్‌లోని పైన్ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో అత్యుత్తమ జీపీఏ సాధించిన విద్యార్థులకు పైన్ విద్యా సంస్థల చైర్మన్ మూగల కుమార్ యాదవ్, డైరెక్టర్లు పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. ఈ సందర్భంగా మూగల కుమార్ యాదవ్ మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన 57 మంది విద్యార్థులు 10/10 జీపీఏ సాధించారన్నారు. 70 మంది విద్యార్థులు 9.8, 55 మంది విద్యార్థులు 9.7, 61 మంది విద్యార్థులు 9.5 జీపీఏతో జిల్లాలోనే అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యా సంస్థగా పైన్ నిలిచిందన్నారు. గణితంలో 236 మంది, సైన్స్‌లో 204 మంది, సోషల్‌లో 227 మంది, తెలుగులో 346 మంది, హిందీలో 238 మంది, ఇంగ్లిష్‌లో 233 మంది 10/10 జీపీఏ సాధించారని వివరించారు. నిపుణులైన ఉపాధ్యాయులతో అత్యుత్తమ విద్యా బోధన అందించి అద్భుత ఫలితాలు సాధించామన్నారు. ఫలితాలు సాధించిన ఉపాధ్యాయులు, విద్యార్థులకు, తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు పి.రాజేంద్ర కుమార్, మూగల రమ, జె.శ్రీనివాస్, ఐఐటి కో ఆర్డినేటర్ మూగల రమేష్ యాదవ్, ప్రిన్సిపాల్‌లు బి.సతీష్ యాదవ్, జి.రాజ్ కుమార్, కవితా రాణి, పి.విశాల్, దినేష్, ప్రగతి రెడ్డి, ఎం.నవిత పాల్గొన్నారు.

'శివానీ' సంచలనం



విద్యార్థిని అభినందిస్తున్న తాళ్లపల్లి స్వామి

హసన్‌పర్తి: పదో తరగత పరీక్ష ఫలితాల్లో నగరంలోని శివానీ విద్యాసంస్థల విద్యార్థులు సంచలనం సృష్టించారు. భీమారం, హనుమకొండ, బేబి సైని హైస్కూల్, గోపాలపురం బ్రాంచ్‌లకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. హఫిజా 10/10 జీపీఏ, జి.దీక్షిత 10/10జీపీఏ, జె.కావ్యశ్రీ 10/10జీపీఏ, సల్మా10/10జీపీఏ, ఎ.చైత్ర 10/10 జీపీఏలు సాధించినట్లు విద్యాసంస్థల కరస్పాండెంట్ తాళ్లపల్లి స్వామి తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కరస్పాండెంట్ తాళ్లపల్లి తిరుపతి, ప్రిన్సిపాల్ సురేందర్‌రెడ్డి, వి.చంద్రమోహన్, డైరెక్టర్లు రాజు, రమేష్, మురళీధర్, వి.సురేష్, ఎస్.సంతోష్‌రెడ్డి అభినందించారు.

స్పెక్ట్రా గ్లోబల్ స్కూల్ ఉత్తమ ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ప్రశాంతి రెడ్డి

హన్మకొండ: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో హనుమకొండలోని పాఠశాలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని స్పెక్ట్రా గ్లోబల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎల్.ప్రశాంతి రెడ్డి తెలిపారు. బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆమె అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తమ స్కూల్‌కు చెందిన జి.లక్ష్మి విధాత్రి, డి.హాసిని, జి.చిత్ర, ఎస్.కౌశిక్, ఎం.వినోద 10/10 జీపీఏ సాధించారని వివరించారు. ఎం.శ్రీరాణి, ఎం.సిద్దార్థ 9.8, కె.అక్షయ్, ఎస్.నిక్షిత, పి.రిషిత్ ఎం.సాయిచరణ్ 9.7 జీపీఏ సాధించారన్నారు. ముగ్గురు విద్యార్థులు 9.5, ఇద్దరు 9.3, ఇద్దరు 9 జీపీఏతో పాటు వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు వివరించారు.

పదో తరగతి ఫలితాల్లో డిస్నీల్యాండ్ హవా..



ఊరుగొండ వర్షిత, బోనాల శ్రీజ, ఎడ్ల అశ్విత్

దామెర: మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలోని డిస్నీల్యాండ్ ఇ–టెక్నో పాఠశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. బుధవారం ప్రకటించిన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో పాఠశాలకు చెందిన ఊరుగొండ వర్షిత, బోనాల శ్రీజ, ఎడ్ల అశ్విత్‌లు 10 జీపీఏ సాధించగా, ఆరుగురు విద్యార్థులు 9.8జీపీఏ పాయింట్లు సాధించారు. పాఠశాల విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు కరస్పాండెంట్ డి.శోభారాణి వెల్లడించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతోపాటు, ఉత్తమ ఫలితాలు సాధించేందకు కృషిచేసిన ఉపాధ్యాయులను పాఠశాల ముఖ్య సలహాదారులు దయ్యాల మల్లయ్య, దయ్యాల సదయ్య, బాలుగు లక్ష్మీనివాస్, డైరెక్టర్లు డి. రాకేష్‌భాను, డి.దినేష్‌చందర్ విద్యార్థులను అభినందించారు.

పథకాలు పటిష్టంగా అమలు చేయాలి



మాట్లాడుతున్న సయ్యద్ షహజాది

మహబూబాబాద్: కేంద్ర ప్రభుత్వం మైనార్టీ సంక్షేమ కోసం ప్రవేశపెట్టిన పథకాలను పటిష్టంగా అమలుచేయాలని జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ షహజాది అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ శశాంక, ఎస్పీ శరత్‌చంద్రపవార్ అధ్యక్షతన జిల్లాలో అమలుచేస్తున్న పలు సంక్షేమ పథకాలను 15 అంశాల్లో సమగ్రంగా సమీక్షించారు. అంగన్‌వాడీ కార్యకలాపాల గురించి, మైనార్టీ సంక్షేమం పాఠశాలలో వసతుల కల్పన, డీఆర్‌డీఏ ద్వారా అమలవుతున్న పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా సయ్యద్ షహజాది మాట్లాడుతూ కంకర బోడ్ ప్రాంతంలో మైనార్టీలు అధికంగా ఉన్నందున రెండు కేంద్రాలను పటిష్టంగా నిర్వహించాలన్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉర్దూ మీడియంలో మైనార్టీ ఉపాఠశాలల వివరాలు ఇవ్వాలని డీఈఓను ఆదేశించారు.సమావేశంలో అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీఓలు కొమురయ్య, రమేష్, డీఆర్‌డీఓ సన్యాసయ్య పాల్గొన్నారు.